# నేతన్నలకు ఉత్తమ అవార్డులు

- చేనేత జౌళీశాఖ నిర్ణయం
- దరఖాస్తులకు ఆహ్వానం

రాజన్న సిరిసిల్ల, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు ఉత్తమ అవార్డులు ఇవ్వాలని చేనేత జౌళీ శాఖ నిర్ణయించింది. అందుకు చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ది. వస్త్ర ఉత్పత్తులు, డిజైనర్లకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేయనున్నది. దరఖాస్తు ఫారాలు సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని జౌళీశాఖ కార్యాలయంలో లభిస్తాయని ఆ శాఖ ఏడీ మిట్టకోల సాగర్ తెలిపారు. వృత్తిలో నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా అవార్డులు ఇస్తామని పేర్కొన్నారు. అవార్డుకు ఎంపికైన కళాకారుడికి ₹25 వేల నగదు, మెమొంటోతో సత్కరిస్తారని చెప్పారు. 2023 డిసెంబర్ 31 నాటికి 30 ఏళ్లు నిండి పదేళ్లకు తగ్గకుండా అనుభవం ఉండాలని, చేనేత డిజైనర్లు 25 ఏళ్లు నిండి ఆయా రంగంలో 5 ఏళ్ల అనుభవం ఉండాలని సూచించారు. అర్హత కలిగిన కళాకారులు జూలై 10లోగా దరఖాస్తులు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో సమర్పించే వస్త్రం పూర్తిస్థాయి లో ఉండి, గతంలో ఆ డిజైన్ ఎవరు కూడా తయారు చేసి ఉండకూడదని, శాంపిల్స్ ఎవరికీ విక్రయించరాదని, ఒకవేళ ఎవరికైనా విక్రయిస్తే దానిని అవార్డుకు ఎంపిక చేయరని చెప్పారు. మగ్గంపై తానే స్వయంగా తయారు చేసినట్లుగా స్వీయ ధ్రువీకరణ పత్రం స్వీకరించాల్సి ఉంటుందని ఆయన సూచించారు.

# అంజన్న క్షేత్రంలో పవన్ కళ్యాణ్

- ఏపీ డిప్యూటీ సీఎంగా అధికారిక హోదాలో రాక
- స్వామివారికి ప్రత్యేక పూజలు.. మొక్కుల చెల్లింపు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు



ఆలయంలో పూజలు చేస్తున్న పవన్‌కళ్యాణ్

కొండగట్టు గుట్టపై ప్రజలు, అభిమానులకు నమస్కరిస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 29: కొండగట్టు అంజన్నను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ శనివారం దర్శించుకున్నారు. పార్టీ ప్రచార వాహనం వారాహికి గత జనవరి 24న ఇక్కడే ప్రత్యేక పూజలు చేసిన ఆయన, ఏపీ ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. శనివారం అధికారిక హోదాలో అంజన్నను దర్శించుకున్నారు. పవన్‌కు ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్‌స్వామి నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆహ్వానించారు. ప్రధానాలయంలో మూలవిరాట్ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు లక్ష్మీ అమ్మవారిని, వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా, అర్చకులు గోత్రనామాల పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందించారు. ఆ తర్వాత ఆలయ అభివృద్ధి విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయించి 100 గదుల ధర్మశాలను నిర్మించాలని, ఒకే సారి 2వేల మందితో దీక్షావిరమణ చేసేలా మండపం నిర్మించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని పవన్‌కళ్యాణ్‌కు ఈవో వినతిపత్రాన్ని అందజేశారు. పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో కొండగట్టుకు చేరుకోగా, కారు రూఫ్‌టాప్ పై నుంచే ఆయన అభివాదం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, సినీ ప్రముఖులు ఆనంద్‌సాయి, ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, శ్రీనివాసశర్మ, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, సీఐ నీలం రవి, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, రంగన్న, రామకృష్ణ, ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, జనసేన నాయకులు మహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీసాగర్, ప్రేమ్‌కుమార్, రాజలింగం, నగేశ్, సంపత్‌నాయక్, దామోదర్ ఉన్నారు.

# ఒకే ఒక్కడు.. 500 మొక్కలు

కొండగట్టులో నాటిన సామాజిక సేవకుడు



కొండగట్టు ఘాట్‌రోడ్‌లో మొక్క నాటుతున్న సామాజిక సేవకుడు సత్యనారాయణ

మల్యాల, జూన్ 29 : కొండగట్టు దిగువన, ఘాట్ రోడ్ మార్గంలో హస్నాబాద్‌కు చెందిన సామాజిక సేవకుడు సత్యనారాయణ 500 మొక్కలను సొంతంగా నాటాడు. కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ గతంలోనూ శాతవాహన యూనివర్సిటీ, రైల్వేస్టేషన్, కోర్టు ప్రాంగణంలో సొంత ఖర్చులతో మొక్కలను నాటాడు. తాజాగా, శనివారం కొండగట్టు ఘాట్ రోడ్ మార్గంలో మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచాడు. భవిష్యత్ తరాలకు ప్రాణ వాయువును పెంపొందించేందుకు తన వంతుగా మొక్కలు నాటుతున్నానని సత్యనారాయణ తెలిపాడు.



గంగారాజంను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు



గంగారాజంను కారులో తీసుకువెళ్తున్న కమిషనర్ తిరుపతి

# సన్మానించి.. కారులో ఇంటికి దింపి

కోరుట్ల, జూన్ 29: కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో 42 ఏళ్లపాటు జవాన్‌గా సేవలు అందించిన బలవంతుల గంగారాజానికి అధికారులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన గంగారాజంను శాలువా, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను ప్రదానం చేశారు. మున్సిపల్ జవాన్‌గా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుని కొత్త బట్టలు పెట్టి సత్కరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తిరుపతి దగ్గరుండి గంగారాజంను తన కారులో కూర్చోబెట్టుకుని ఆయన ఇంటి వద్ద దిగబెట్టారు. ఇక్కడ కౌన్సిలర్ మోర్తాడు లక్ష్మీనారాయణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# రామగిరి కానిస్టేబుల్ సస్పెన్షన్

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 29 : క్రమశిక్షణా రాహిత్యం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో రామగిరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ సీహెచ్ సదానందంను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలో పనిచేసే అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ తప్పినా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- బైక్‌లపై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇండ్ల గుర్తింపు
- రాత్రి వేళ ఊరి శివారులో బైక్‌లు నిలిపి ఇండ్లల్లో దొంగతనాలు
- తాజాగా ముఠా సభ్యుల అరెస్ట్
- 260 గ్రాముల బంగారు నగలు, కారు, మూడు పంపు సెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్




స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, మోటర్లను చూపుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 29 : పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతూ నగలు దోచుకెళ్లే దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల పోలీసు ప్రధాన కార్యాలయంలో జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని తారకరామనగర్‌కు చెందిన వనం రాముపై జిల్లాతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు దొంగతనాల కేసులున్నాయి. చోరీ కేసులో జైలుకు సైతం వెళ్లి ఇటీవలే బయటకు వచ్చాడు. అయినా, బుద్ధి మార్చుకోని రాము తమ కాలనీకే చెందిన జగన్నాథ్ అభియా, జగన్నాథ్ మీనయ్య, దాసరి రవి, వనం పాపయ్యతో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. వీళ్లు ఐదుగురు కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పగటి పూట బైక్‌లపై తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇండ్లను గుర్తించి, చోరీలకు ప్లాన్ వేసేవారు. ఆ తర్వాత రాత్రి సమయంలో బైక్‌లను ఊరి శివారులో నిలిపి, ఇండ్ల తాళాలు పగులగొట్టి బంగారు నగలు దోచుకెళ్లే వారు. అనంతరం నగలను విక్రయించి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే వారు. ఈ ముఠా సభ్యులు మల్యాల, కొడిమ్యాల, జగిత్యాల రూరల్, మేడిపెల్లి, రాయికల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మార్చి నుంచి ఇప్పటి వరకు 11 ఇండ్లలో చోరీలకు పాల్పడ్డారు. జగిత్యాల రూరల్ మండలం పరిధిలోని ఎస్సారెస్పీ కాలువకు రైతులు అమర్చుకున్న ఐదు వ్యవసాయ మోటర్లను సైతం ఎత్తుకెళ్లారు. జగిత్యాల సహ ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి విచారణ జరుపగా, ముఠా విషయం బయటపడింది. జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై దొంగలమర్రి చెక్ పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఐ-20 కారులో వనం రాము, అభియా, మీనయ్య పట్టుబడ్డారు. చోరీ సొత్తును జగిత్యాలకు చెందిన సిద్దార్థ జువెల్లర్స్‌కు చెందిన గంగాధర్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నారని, వీరి వద్ద నుంచి ₹30 లక్షలు విలువైన 260 గ్రాముల బంగారు నగలు, మూడు వ్యవసాయ విద్యుత్ మోటర్లు, ఒక ఐ-20 కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి బంగారం కొనుగోలు చేసిన గంగాధర్‌ను సైతం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న దాసరి రవి, వనం పాపయ్యను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజు, రాజయ్య, సౌందర్య, కానిస్టేబుళ్లు తిరుమల్, చంద్రశేఖర్, వినోద్, రాజు, సాగర్, శ్రీకాంత్, రాకేశ్, కళ్యాణ్, స్వప్న, సీడీఆర్ సెల్ కానిస్టేబుళ్లు నేరెల్ల రాజశేఖర్, కొల్లూరి మహేశ్, మల్లేశంను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు. సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లై అధికారులు

# రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ

మానకొండూర్ రూరల్/ తిమ్మాపూర్ రూరల్, జూన్ 29 : మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లోని పలు రైస్‌మిల్లుల్లో శనివారం సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మానకొండూర్ మండలం ముంజంపల్లి శివారులోని వీరభద్ర రైస్‌మిల్లు, తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులోని ఆర్‌కే ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేసి.. స్టాక్, గతంలో సీఎంఆర్ రైస్ బ్యాగుల వివరాలు సేకరించారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీఎస్‌వో వెంకటేశ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీఎస్‌వో (జగిత్యాల) వెంకటేశ్వర్ రావు, ఎస్ఐ పరం జ్యోతి, అనిల్ కుమార్, డీఎం అలేరామ్, మానకొండూర్ సీఐ మాదాసు రాజ్‌కుమార్, మానకొండూర్ ఎలక్షన్ డీటీ రాఖేశ్, గిర్దవార్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖని: మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

# ప్రైవేటీకరణను తిప్పికొడతాం

- తట్టెడు బొగ్గు తీయకుండా అడ్డుకుంటాం
- కలిసివచ్చే సంఘాలతో ఐక్య పోరాటాలు చేస్తాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 29: తెలంగాణలోని బొగ్గు బ్లాకుల్లో ప్రైవేట్ వ్యక్తులు తట్టెడు బొగ్గు కూడా తీయకుండా అడ్డుకుంటామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి హెచ్చరించారు. టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భంలోని ఖనిజ నిక్షేపాలను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తూ గతంలో కాంగ్రెస్ ప్రారంభించిన దుర్మార్గమైన పద్ధతులకు బీజేపీ ప్రభుత్వం మెరుగులు దిద్ది వేలం వేయాలని చూస్తున్నదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్మికులు గమనించాలని కోరారు. ఎంఎండీఆర్ 2015 చట్టాన్ని మూజువాణి ఓటు ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆమోదించిన విషయాన్ని రాజిరెడ్డి గుర్తు చేశారు. బొగ్గు, ఇతర ఖనిజాల తవ్వకంపై కేంద్రం తెచ్చిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గడిచిన ఐదేండ్లలో దేశంలో బొగ్గు పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య 60శాతానికి పడిపోవడానికి అప్పటి కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్‌సింగ్ పుణ్యమేనని మండిపడ్డారు. అప్పుడు కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీలు చేస్తున్న ప్రైవేటీకరణ చర్యలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బొగ్గు బ్లాక్‌ల వేలం వేయడం అంటేనే బొగ్గు సంస్థల ప్రైవేటీకరణ అని ఆయన తేల్చిచెప్పారు. వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా కలిసి వచ్చే కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో ఐక్య పోరాటాలు చేస్తాయని ఆయన వెల్లడించారు.

# ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తాం

- కూనారంలో ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకున్న గ్రామస్తులు, తల్లిదండులు
- దాదాపు 16 మంది పిల్లలకు మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్



కాల్వశ్రీరాంపూర్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్, జూన్29: 'మా పిల్లలను ఇక నుంచి ప్రైవేట్ స్కూల్‌కు పంపం. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తం' అంటూ కూనారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. గ్రామంలోని దాదాపు 50 మంది పిల్లలు పలు ప్రైవేట్ స్కూల్లో అభ్యసిస్తున్నారు. అయితే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మూత పడే స్థితికి చేరుకోగా, గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. ప్రైవేట్‌లో చదివే విద్యార్థులను తీసుకెళ్లేందుకు శనివారం వచ్చిన స్కూల్ బస్సు, వ్యాన్‌ను గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు అడ్డుకున్నారు. విద్యార్థులను బస్సుల్లోంచి దించేశారు. ఇక నుంచి తమ గ్రామానికి ప్రైవేట్ బస్సులు రావద్దని స్పష్టం చేశారు. 11 మందిని మోడల్ స్కూల్లో, ఐదుగురిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. మిగతా వారిని సోమవారం చేర్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, మన పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, సకల సౌకర్యాలు ఉన్నాయని, ఎవరు తమ పిల్లల్ని ప్రైవేట్‌కు పంపవద్దని తల్లిదండ్రులను కోరారు. ఇక్కడ ఎంపీటీసీ కొల్లూరి రమ రాయమల్లు, మాజీ సర్పంచ్ దొనికెన విజయ మొగిళి, మాజీ ఉప సర్పంచ్ బోడకుంట్ల తిరుపతి, నాయకులు నారగోని లక్ష్మణ్ ఉన్నారు.




కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# గనుల వేలాన్ని నిలిపివేయండి

కరీంనగర్ తెలంగాణచౌక్, జూన్ 29 : కేంద్రం ప్రభుత్వం బొగ్గు గనులను వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకు చెందిన మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని ఖండించారు. బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించకుండా ప్రైవేటీకరణ చేయడం వల్ల లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం సిగ్గు చేటన్నారు. బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే సింగరేణి సంస్థ బలహీన పడి మూత పడే ప్రమాదం ఉంటుందన్నారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో ₹6 లక్షల కోట్ల విలువైన దేశ సంపదను ప్రైవేట్ సంస్థలకు విక్రయించదని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు ఉండి కూడా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తక్కువ ధరకు బొగ్గును ఉత్పత్తి చేసే సింగరేణి సంస్థను కాదని ప్రైవేట్ కంపెనీలు బొగ్గు బ్లాక్‌లను విక్రయిస్తే రానున్న రోజుల్లో కరెంటు ధరలు పెరుగుతాయని తెలిపారు. లాభాల బాటలో నడుస్తున్న సింగరేణి సంస్థకు కాపాడుకోడానికి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నిరసనలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సత్యం, భీమాసాహెబ్, ఎడ్ల రమేశ్, తిరుపతి, వర్ణ వెంకటరెడ్డి, రవి, రాకేశ్ పాల్గొన్నారు.

# తంగళ్లపల్లి ఠాణాలో కలకలం

- ఓ కేసు విషయంలో హెడ్ కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్
- హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

సిరిసిల్ల రూరల్, జూన్ 29 : ఓ కేసు విషయంలో తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న వీడియో శనివారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం జరిగినట్లు తెలిసింది. ఈ వీడియో ఒక్కసారిగా సోషల్‌మీడియాలో రావడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై జిల్లా పోలీస్ బాస్ ఆరాతీసినట్లు తెలిసింది. ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ విభాగం ఘటనపై పూర్తి స్థాయి వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, బాధితులు ఠాణాకు చేరితే సరిగ్గా రిసీవ్ చేసుకునే వారు లేరని కొంతకాలంగా తంగళ్లపల్లి ఠాణాపై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్ కావడం పోలీస్‌శాఖలో కలకలంరేపింది. ఈ విషయమై ఎస్ఐ సుధాకర్‌ను సంప్రదించగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ సాంబశివరావును జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశామని చెప్పారు.











